RNI NO:Title-Code:-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 1 సంచిక - 286 మంగళవారం 12 నవంబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



6లో.

## సినీ కార్మికులకు శుభవార్త

ఇళ్లు ఇప్పిస్తామని మంత్రి కోమటిరెడ్డి



# తెలంగాణ ఏమీ కోల్పోలేదు

ఓ నలుగురి ఉద్యోగాలు మాత్రమే పోయాయి

కెసిఆర్ వ్యాఖ్యలపై సిఎం రేవంత్ సెటైర్లు

ఏఎంవీఐలకు నియామక పత్రాల అందజేత



హైదరాబాద్, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): గత ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగుల గురించి ఎప్పుడూ ఆలోచించ లేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ ఏమి కలో÷-పోలేదని, ఓ కుటుంబంలో నలుగురు ఉద్యోగాలు కోల్పోయారని పరోక్షంగా కెసిఆర్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. ఖైరతాబాద్‌లో ఏఎంవీఐలకు నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు గతంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ బాట పట్టారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమ పోరాట నేపథ్యమే ఉద్యోగాలని అన్నారు. సొంత రాష్ట్రంలో జాబ్ నోటిఫికేషన్లు వస్తాయని వారు ఆశించారన్నారు. కానీ గత పదేళ్లలో నిరుద్యోగులను దగా చేశారని అన్నారు.

మిగతా 2లో.

# అప్పుడే వణికితే ఎలా?

- ఢిల్లీలో అడుగుపెట్టగానే కెటిఆర్ ట్వీట్
- కేంద్రమంత్రి మనోహర్ కట్టర్‌తో భేటీ
- అమృత్ టెండర్లలో అవినీతి జరిగిందంటూ ఫిర్యాదు
- తన ఢిల్లీ పర్యటన కాంగ్రెస్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నదని వ్యాఖ్య



ఢిల్లీ నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): నేను ఇప్పుడే ఢిల్లీ లో అడుగుపెట్టాను.. అప్పుడే హైదరాబాద్ ప్రకంపనలు ప్రారంభమైనట్లు తెలిసిందని..అప్పుడే వ ణికితే ఎలా..? అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కాంగ్రెస్ నేతలపై ఎక్స్ వేదికగా సె టైర్లు వేశారు. మాజీ మంత్రి కె.టి. రామారావు, తన బృందంతో సోమవారం హుటాహుటిన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి అమృత్ టెండర్ల విషయంలో జరిగిన అవినీతిపై కేంద్రమంత్రికి ఫిర్యాదు చేశారు. కాగా.. తెలంగాణ రా ష్ట్రంలో అమృత్ పథకం టెండర్లపై విచారణ జరిపి అక్రమాలు వెలికి తీయాలంటూ గతంలో కెటిఆర్ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, టోచన్ సాహులకు లేఖ రాశారు. దీనిపై విచారణ చేసి ని జనిజాలు నిగ్గుతేల్చాలని, లేకుంటే కాంగ్రెస్ ప్ర భుత్వం పాల్పడే అవినీతిలో కేంద్రానికీ వాటా ఉందని నమ్మాల్సి వస్తుందని పేర్కొన్నారు కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేసేందుకు కాంగ్రెస్ పార్టీ నేతన్న కడుపు కొడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బతుకమ్మ చీరులతో నేతన్నలకు కేసీఆర్ ఉపాధి కల్పించారని చెప్పారు. ఆ బతుకమ్మ చీరలపై కాంగ్రెసోళ్లకు విపరీతమైన కక్ష అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ వచ్చి నేతన్నల మగ్గాలను మళ్లీ ఆపిందని, వారిని అప్పులపాలు చేసిందన్నారు. వారికి మళ్లీ ఉరితాడునిచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రలా అంటూ గోరటి వెంకన్న పాడిన సాలెల మగ్గం సడుగులిరిగినయ్ అనే పాట కాంగ్రెస్ పాలనలో మళ్లీ యాదికొస్తున్నదని ఎక్స్ వేదికగా వెల్లడించారు.

# రైతులను ఇబ్బంది పెట్టే వ్యాపారులపై ఎస్మా

## కొనుగోళ్లు సాఫీగా సాగేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి అధికారులను సూచించిన సీఎం రేవంత్



హైదరాబాద్, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాంటి వ్యాపారులపై అవసరమైతే ఎస్సెన్సియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న సంఘటనలు దృష్టికి రావటంతో స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. రైతులు పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో మోసాలకు పాల్పడటం, రైతులను గందరగోళానికి గురి చేయటం, రైతులను వేధించటం లాంటి సంఘటనలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.

మిగతా 2లో.

# సుప్రీం చీఫ్ జస్టిస్‌గా సంజీవ్ ఖన్నా ప్రమాణం

## ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

## హాజరైన ప్రధాని మోడీ, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు



న్యూఢిలీ నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): భారతదేశ 51వ ప్రధాన న్యాయమూర్తిగాజస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ సంజీవ్ ఖన్నాతో.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ ప్రమాణ స్వీకారం చేయించారు.. సీజేఐగా జస్టిస్ డి.వై.చంద్రచూడ్ పదవీకాలం ముగిసింది. దీంతో జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తర్వాత దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం ప్రమాణం చేశారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, మాజీ సీజేఐ డీవై చంద్రచూడ్ తదితరులు పాల్గొన్నారు. బాధ్యతలు స్వీకరిస్తున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా.. వచ్చే ఏడాది 2025 మే 13 వరకు సీజేఐగా కొనసాగుతారు. 2019 జనవరి నుంచి సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సంజీవ్ ఖన్నాఈ ఆరేళ్ల కాలంలో 117 తీర్పులు రాశారు. 456 తీర్పుల్లో సభ్యుడిగా భాగస్వాములయ్యారు. ఈవీఎంల నిబద్ధతను సమర్థిస్తూ కీలకమైన తీర్పు వెలువరించారు.

మిగతా 2లో.



# 13 మంది ఐఏఎస్ ల బదిలీ

టూరిజం, కార్యదర్శిగా స్మితా సబర్వాల్

జీహెచ్ఎంసీ కమిషనర్ గా ఇలంబర్తి

ట్రాన్స్ కో సీఎండీగా కృష్ణ భాస్కర్

2లో.

# కులగణన, పూర్తయ్యాక కొత్త రేషన్‌కార్డులు

పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



2లో.

# ఉద్రిక్తంగా ఫార్మా భూసేకరణ

## కలెక్టర్ తదితరులపై గ్రామస్థుల దాడి



వికారాబాద్ నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్‌పై దాడి జరిగింది. కలెక్టర్ తోపాటు పలువురు అధికారులను రాళ్లతో తరిమికొట్టారు. ఈ ఘటన దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామంలో జరిగింది. ఫార్మా కంపెనీపై అభిప్రాయ సేకరణకు కలెక్టర్ ప్రతిక్ జైన్,కొడంగల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, పలువురు అధికారులు వెళ్లారు. ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వాలంటూ రైతులను, గ్రామస్తులను కలెక్టర్, అధికారులు కోరారు. తాము భూములు ఇవ్వమంటూ ఒక్కసారిగా కలెక్టర్, అధికారులపై గ్రామస్తులు దాడికి పాల్పడ్డారు. దీంతో అక్కడి నుంచి వెళ్ళిపోతున్న కలెక్టర్, అధికారుల వాహనాలను వెంబడించి రాళ్లు, కర్రలతో దాడికి యత్నించారు. ఈ దాడిలో అధికారుల పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ క్రమంలోలగ్గిచర్లలో ఫార్మా విలేజ్‌పై అభిప్రాయ సేకరణ తీవ్ర ఉద్రిక్తంగా మారింది. కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై మహిళా రైతు చేయిచేసుకుంది. వెనుక నుంచి కలెక్టర్ భుజంపై కొట్టడం కలకలం రేపింది. ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా రైతులు ఆందోళనకు దిగారు. కలెక్టర్, అధికారుల కార్లపై రాళ్లు రువ్వారు. రైతుల దాడిలో మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని లగ్గిచర్ల, పోలేపల్లి, హీకంపేట మూడు గ్రామాల్లో ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేసేందుకు మూడు వేల ఎకరాల సేకరణ కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు.

మిగతాది 2లో...

# బిసిల గురించి మాట్లాడే అర్హత లేదు

## కెటిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ పొన్నం



సిరిసిల్ల, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): బీసీలకు కాంగ్రెస్ ఒక్క హామీని నెరవేర్చలేదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అసలు బీసీల గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు ఉందా అని ప్రశ్నించారు. కార్తీక సోమవారం సందర్భంగా వేములవాడలో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని మంత్రి దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోన్న సమగ్ర కుటుంబ సర్వే ప్రజలను ఇబ్బంది పెట్టేందుకు కాదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవి, కార్యనిర్వాహక పదవి , ప్రతిపక్ష పదవి బీసీ లకు, ఎస్సీలకు ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసిన బీఆర్ఎస్ మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న కుల సర్వే దేశ వ్యాప్తంగా జరగాలని డిమాండ్ ఉందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు సర్వేపై అక్కడక్కడా అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ పార్టీల రెచ్చగొట్టే వ్యాఖ్యలకు ప్రభావితం కావద్దని ప్రజలను మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. వేములవాడ రాజన్నను మంత్రి పొన్నంతో పాటు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దర్శించుకున్నారు.బీసీలను వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు బేషరుతుగా క్షమాపణలు చెప్పాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. దీంతో కెటిఆర్ వ్యాఖ్యలపై పొన్నం మండిపడ్డారు.

# 13 మంది ఐఏఎస్ ల బదిలీ

**టూరిజం, కార్యదర్శిగా స్మితా సబర్వాల్**
**జీహెచ్ఎంసీ కమిషనర్ గా ఇలంబర్తి**
**ట్రాన్స్ కో సీఎండీగా కృష్ణ భాస్కర్**




హైదరాబాద్ నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త):
రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణ యం తీసుకుంది. ఐఏఎస్‌లను బదిలీ చేయడంతో పాటు ఐఎఫ్ఎస్‌లను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. పరిపాలన సజావుగా సాగేందుకు ప్రభుత్వం భారీ ప్రక్షాళనను చేపట్టింది. అం దులో భాగంగా 13 మంది ఐఏఎస్‌లతో పాటు 8 మంది ఐఎఫ్ఎస్‌లకు స్థానచలనం కలిగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్ర ధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శిగా ఉన్న స్మితా సబర్వాల్‌కు టూరిజం కల్చరల్ సెక్రటరీగా అదనంగా బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. బిసి వెల్ఫేర్ సెక్రటరీగా శ్రీధర్, మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రటరీగా అనితా రామచంద్రన్, జీహెచ్ఎంసి కమిషనర్‌గా ఇలంబర్తి, డిప్యూటీ సిఎం ప్రత్యేక కార్యదర్శిగా కొనసాగుతున్నకృష్ణ భాస్కర్‌ను ట్రాన్స్‌కో సిఎండీగా బాధ్యతలను అప్పగించారు. ఇక రవాణాశాఖ కమిషనర్‌గా సురేంద్ర మోహన్, పంచాయతీ రాజ్ డైరెక్టర్‌గా శ్రీజన, ఆయూష్ డైరెక్టర్‌గా చిట్టెం లక్ష్మి, ఆరోగ్యశ్రీ సీఈఓగా శివశంకర్, ఇంటర్మీడియట్ డైరెక్టర్‌గా కృష్ణ ఆదిత్య, కార్మిక శాఖ కమిషనర్‌గా సంజయ్ కుమార్, జిఏడి సెక్రటరీగా గౌరవ్ ఉప్పల్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా హరికిరణ్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక ఐఎఫ్ఎస్‌లకు సంబంధించి ప్రియాంకవర్గీస్, శివాల రాంబాబు, డా.సునీల్ ఎస్.హైరమత్, ఎస్.వి.ప్రదీప్‌కుమార్ శెట్టి, పి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్, జే.వసంత, నవీన్‌రెడ్డిలను ప్రభుత్వం బదిలీ చేసింది.

# సుప్రీం చీఫ్ జస్టిస్‌గా సంజీవ్ ఖన్నా ప్రమాణం

(మొదటి పేజి తరువాయి)



ఎన్నికల బాండ్ల పథకం రద్దు, అధికరణం 370 రద్దును సమర్థిస్తూ తీర్పులు ఇచ్చిన ధర్మాసనాల్లో భాగస్వామిగా ఉన్నారు. జనవరి 18, 2019న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన జస్టిస్ ఖన్నా ఆరు నెలల పదవీకాలం తర్వాత మే 13, 2025న పదవీ విరమణ చేయనున్నారు. ఏ హైకోర్టుకైనా ప్రధాన న్యాయమూర్తి కాకముందే సుప్రీంకోర్టుకు పదోన్నతి పొందిన అతికొద్ది మంది న్యాయమూర్తులలో ఆయన ఒకరు. ఢిల్లీ యూనివర్సిటీలో న్యాయవిద్యను అభ్యసించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా.. 1983లో దిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. ట్యాక్సేషన్, ఆర్బిట్రేషన్, కమర్షియల్, కంపెనీ లా కేసులు వాదించారు. 2005 జూన్ 25న ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2006 ఫిబ్రవరి 20న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అంతేకాకుండా.. ఆదాయపు పన్ను శాఖకు సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా, క్రిమినల్ కేసుల్లో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, అమికస్ క్యూరీగా.. పలు విభాగాల్లో కీలక సేవలను అందించారు.

# ఉద్రిక్తంగా ఫార్మా భూసేకరణ

(మొదటి పేజి తరువాయి)

ఈ నేపథ్యంలో చాలా మంది రైతులు భూములను స్వచ్ఛంధంగా ఇచ్చేశారు. అయితే లగ్గిచర్ల గ్రామంలో ముందుగా ప్రజాభిప్రాయసేకణ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో తాత్కాలిక సభను నిర్వహించేందుకు అధికారులు యత్నించారు. అయితే గ్రామానికి దూరంగా ఉండటం వల్ల రైతులు, గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, రెవెన్యూ అధికారులు, పోలీసులు గ్రామానికి వచ్చి ప్రజాభిప్రాయ సేకరణకు ప్రయత్నించారు. ఇంతలోనే ఆందోళన మొదలైంది. ఈ క్రమంలో ఓ మహిళ.. కలెక్టర్ ప్రతీక్ జైన్ వెనుక నుంచి వచ్చి భుజంపై కొట్టింది. దీంతో ఆయన ముందకు తూలారు. ఈ క్రమంలో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గ్రామస్థులకు, అధికారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గ్రామస్థులు తమ ఆందోళనను తీవ్ర తరం చేశారు. అధికారులకు సంబంధించిన మూడు కార్లను ధ్వంసం చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు జిల్లా కలెక్టర్‌ను గ్రామస్థుల బారి నుంచి రక్షించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. ప్రస్తుతం ఉద్రిక్తత కొనసాగుతోంది.

# తెలంగాణ ఏమీ కోల్పోలేదు

(మొదటి పేజి తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 50 వేల ఉద్యోగ నియామకపత్రాలు అందించామన్నారు. నియామకాల ప్రక్రియ త్వరగా చేపట్టేలా పర్యవేక్షించామని వివరించారు. నిరుద్యోగుల కు నియామక పత్రాలు అందించడం నాకు సంతృప్తిని ఇస్తుందని అంటూ.. గత పాలకులు వాళ్ల ఉద్యోగాల గురించి మాత్రమే ఆలోచించారని మండిపడ్డారు. వారే తెలంగాణ ఎంతోకోల్పోయిందని అంటున్నారని మండిపడ్డారు. కొందరు డ్రగ్స్ తీసుకుంటూ దొరికినా మమ్మల్ని పట్టుకోవద్దని దబాయిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సింది పోయి ఇలాంటి దగుల్బాజీ పనులు చేస్తే ఎలా అన్నారు. ఫామ్‌హౌస్‌లో కొందరు మద్యం తాగి దీపావళి చేసుకుంటున్నారు. 10 నెలల్లో ఏం కోల్పోయిందో ప్రజలు తెలుసుకున్నారని ఒక పెద్దాయన అంటున్నారు. తెలంగాణ ఏం కోల్పోలేదు.. పెద్దాయన ఇంట్లో నలుగురు ఉద్యోగాలు కోల్పోయారు. చిచ్చుబుడ్లకు బదులు సారా బుడ్లతో కొందరు దీపావళి చేసుకున్నారు.గత ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్ ఒక్కటైనా కట్టిందా? అలాంటి స్కూల్ నిర్మించలేదు కానీ.. ఆయన మాత్రం 10 ఎకరాల్లో ఫామ్ హౌస్ కట్టుకున్నారు. 2011లో రాష్ట్రంలో చివరిసారిగా గ్రూప్-1 పరీక్ష నిర్వహించారు. సుమారు 13 ఏళ్ల పాటు నిర్వహించలేదు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా పట్టుబట్టి గ్రూప్-1 పరీక్షలు నిర్వహించాను. త్వరలో నియామక పత్రాలు అందజేస్తాను. అసెంబ్లీకి వచ్చి సమస్యలపై చర్చించడం ప్రతిపక్ష నేత బాధ్యత. ఆయన అసెంబ్లీకి రావాలని మేం అడుక్కోవాల్సిన పరిస్థితి ఉందని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తి ఇవాళ బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఏం కోల్పోయిందో ప్రజలు గుర్తించాని అన్నారు. ఇకపోతే..నెలకొక సారి అయినా ఉన్నత ఉద్యోగంలో ఉన్నవాళ్లు స్వంత ఊర్లకు వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. వెనుకబడ్డ వారి సమస్యలు అడిగి తెలుసుకోండని.. స్ఫూర్తి కలిగించండన్నారు. 'లీడర్ అంటే లీడ్ చేసే వాడు. కానీ గృహ ప్రవేశాలు అంటూ దావత్ లు చేసుకుంటున్నామని బయటకు చెప్తున్నారు. పోలీస్, రవాణా శాఖ వాళ్ళకి సూచిస్తున్న..నిన్న ఒక పెద్దయన చాలాకాలం తర్వాత బయటకి వచ్చి, జనం నష్ట పోయారు అంటాడు. నష్ట పోయింది మీ 4 నలుగురుకి ఉద్యోగం పోయింది అది మాత్రమే నష్టం. కోట్ల మంది మహిళలు మహాలక్ష్మి పథకం వినియోగించుకుని మహిళలు బస్సులు ఎక్కుతున్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం 10 లక్షలు వినియోగించుకుంటూ వైద్యం చేసుకుంటున్నారు.' అని సీఎం వ్యాఖ్యానించారు. 500 రూపాయలకు గ్యాస్ అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొత్తగా ఎంపికైన ఏఎమ్‌వీఐలు సామాజిక బాధ్యత తీసుకుని స్థానిక పాఠశాలల్లో విద్యార్థుల వద్దకు వెళ్లి చదువుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. 500 రూపాయలకు గ్యాస్ అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొత్తగా ఎంపికైన ఏఎమ్‌వీఐలు సామాజిక బాధ్యత తీసుకుని స్థానిక పాఠశాలల్లో విద్యార్థుల వద్దకు వెళ్లి చదువుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. పక్క రాష్ట్రాల నుంచి ఇతర ప్రాంతాల నుంచి గంజాయి రవాణాను అడ్డుకోవడం లో రవాణా శాఖ కీలక పాత్ర పోషిస్తుంది. గ్రూప్ 1 పరీక్షలను 12 ఏళ్లుగా నిర్వహించలేదు. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత 563 మందికి నోటిఫికేషన్ ఇచ్చాం అన్నారు.బడి దొంగలను చూశాం.. కానీ అసెంబ్లీకి రాని వారిని చూడలేదు. రెండవ సారి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండవ విడత జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇస్తాం.' అని సీఎం తెలిపారు. పక్క రాష్ట్రాల నుంచి ఇతర ప్రాంతాల నుంచి గంజాయి రవాణా ను అడ్డుకోవడంలో రవాణా శాఖ కీలక పాత్ర పోషిస్తుంది.

# రైతులను ఇబ్బంది పెట్టే వ్యాపారులపై ఎస్మా

(మొదటి పేజి తరువాయి)

రాష్ట్రమంతటా ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులుంటే వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించాలని తెలిపారు. సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు బంద్ చేస్తున్నట్టు జిన్నింగ్ మిల్లులు ప్రకటించాయి. సీసీఐ, రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఇకపై పత్తి కొనుగోలు చేయబోమని రాష్ట్ర జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లుల యాజమాన్యాల సంఘం ప్రకటించింది. ఆదివారం సమావేశమైన సంఘం నేతలు పత్తి కొనుగోళ్ల నిలిపివేతకు సంబంధించి కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సీసీఐ సీఎండీకి లేఖ రాశాయి. పత్తి కొనుగోలులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) అమలు చేస్తున్న అడ్డదిడ్డ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు లేఖలో పేర్కొన్నాయి. ఈ సీజన్‌లో తెలంగాణలో రైతుల నుంచి పత్తి కొనుగోలుపై సీసీఐ ఎన్నడూ లేని విధంగా కొర్రీలు పెడుతున్నది. రెండు రోజుల క్రితం సీసీఐ తీసుకున్న నిర్ణయం ఇటు మిల్లులకు, అటు రైతులకు శరాఘాతంగా మారింది. మొన్నటి వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 318 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు చేసేది. కానీ శనివారం నుంచి సీసీఐ ఈ విధానాన్ని ఎత్తేసి కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీని ప్రకారం ఒక జిల్లాలోని మిల్లులకు ఎల్1, ఎల్2, ఎల్3.. ఇలా క్రమసంఖ్యను కేటాయిస్తుంది. క్లస్టర్ల వారీగా విభజించి మొదటి మిల్లులో సామర్థ్యం మేరకు కొనుగోళ్లు పూర్తయిన తర్వాతే మరో మిల్లులో కొనుగోళ్లు ప్రారంభిస్తుంది. అప్పటి వరకు మిగిలిన మి ల్లుల్లో ఎలాంటి కొనుగోళ్లు ఉండవు. సీసీఐ పత్తి కొనుగోలులో ఇష్టారీతిగా కొర్రీలు పెడుతూ తెలంగాణ రైతులను ఇబ్బంది పెడుతుంటే బాధ్యతగా వ్యవహరించాల్సిన మార్కెటింగ్ శాఖ చేష్టలుడిగి చూస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సచివాలయానికి, మార్కెటింగ్ శాఖకు తిరగడానికే సరిపోతున్నారని, క్షేత్రస్థాయిలో పరిస్థితిని చక్కదిద్దడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పత్తి కొనుగోలులో రైతుల ఇబ్బందులు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. సచివాలయంలో కూర్చొని సమీక్షలు చేసినంత మాత్రాన సమస్యలు పరిష్కారమవుతాయా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఢిల్లీ వెళ్లి సీసీఐ అధికారులను కలిసి తేమ శాతం సడలింపుపై, కొత్తగా అమలు చేస్తున్న నిబంధనల తొలగింపుపై ఎందుకు విజ్ఞప్తి చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు.

# కులగణన, పూర్తయ్యాక కొత్త రేషన్‌కార్డులు

హైదరాబాద్, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త):
లక్షలాది మంది ఎదురు చూ స్తున్న కొత్త రేషన్ కార్డులపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కులగణన, ధాన్యం సేకరణ పూర్తయ్యాక తెల్లరేషన్ కార్డుల జారీపై నిర్ణయం తీసుకుంటామన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ అనాలోచిత నిర్ణయాల వల్ల పౌర సరఫరాల శాఖ నిర్వీర్యమైందని ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ శాఖలో రూ.55 వేల కోట్ల అప్పుని రూ.11 వే ల కోట్లకు తగ్గించామన్నారు. ధాన్యం సేకరణ విషయంలో ము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించారని, ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులతో పర్యవేక్షణ పె ట్టామన్నారు. ఏ కొనుగోలు కేంద్రంలోనైనా ధాన్యం సక్రమం గా కొనుగోలు చేయకపోతే వెంటనే తాము జోక్యం చేసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేశాక రెండు నెలలైనా ధాన్యం డబ్బులు పడలేదన్నారు. ప్రస్తుతం తాము ధాన్యం సేకరించిన రెండు మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామన్నారు.కొన్ని చోట్ల మిల్లర్లు సహాయనిరాకరణ చేస్తున్నారని, మరి కొన్ని చోట్ల జరుగుతున్న చిన్న చిన్న సంఘటనలపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. మిల్లర్లు కొనుగోలు చేయకుంటే స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ ద్వారా 30 లక్షల మెట్రిక్ టన్నుల గోడౌన్ స్పేస్ ను సిద్ధం చేసుకున్నామన్నారు. మిల్లర్లు కొనుగోలు చేయకుంటే ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ రాజకీయ అవసరాల కోసం ఏమైనా మాట్లాడుతుండవచ్చని, కానీ సివిల్ సప్లై డిపార్ట్ మెంట్ గతంలో కంటే ప్రస్తుతం చాలా మెరుగ్గా పని చేస్తున్నదన్నారు. మూసీపై బీఆర్ఎస్ కావాలనే రాద్ధాంతం చేస్తున్నదని, మూసీ పునరుజ్జీవాన్ని నల్గొండ ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు. సీఎంగా రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క, మంత్రులుగా మేమంతా ఓ టీమ్ గా సమిష్టిగా ముందుకు వెళు తున్నామన్నారు. సుప్రీం కోర్టు తీర్పు స్టడీ చేశాకే వర్గీకరణపై సబ్ కమిటీ ఏర్పాటు అయిందని, వర్గీకరణపై వన్ మెన్ జ్యుడిషియల్ కమిషన్ కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ విషంలో ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ముందుకు వెళ్తామన్నారు.

# మోడీ పరివారమో..గాంధీ పరివారమో తేల్చుకోండి

## కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడంలో మైనార్టీలే కీలకం మహారాష్ట్రలోనూ కాంగ్రెస్‌ను గెలిపించండి

## జాతీయ విద్యాదినోత్సవంలో సిఎం రేంవత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త):
రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో మైనారిటీలు కీలక పాత్ర పోషించారని, హిందూ, ముస్లింలు తెలంగాణ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటి వారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మీరంతా అండగా ఉంటే విద్య, వైద్యం, ఉపాధి విషయంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించుకుందామని అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవ వేడుకలు జరిగాయి... ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉన్నవి రెండే పరివార్లు అని, ఒకటి మోదీ పరివార్, రెండోది గాంధీ పరివార్ అని అన్నారు. ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేందుకు మోదీ పరివార్ పనిచేస్తోందని, దేశ సమైక్యతకు గాంధీ పరివార్ కృషి చేస్తోందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. దేశ ప్రజలకు మెరుగైన విద్య అందించేందుకు ఆనాడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకొచ్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ముస్లింలను మేము ఓటర్లుగా చూడటంలేదని, సోదరులుగా, కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క మైనారిటీని కూడా ఎమ్మెల్యేగా గెలిపించుకోలేదని, అందుకే మైనారిటీ మంత్రి ఇచ్చే అవకాశం లేకుండా పోయిందన్నారు. కానీ షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారులుగా చేసామని, అమీర్ అలీ ఖాన్‌కు ఎమ్మెల్సీ ఇచ్చామని, కార్పొరేషన్ పదవులు ఇచ్చామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తరువాత ఇప్పటి వరకు సీఎంవోలో మైనారిటీ అధికారిని నియమించలేదని, మన ప్రభుత్వంలో సీఎంవోలో ఒక మైనారిటీ అధికారిని నియమించామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశంలో మైనారిటీలకు ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా కాంగ్రెస్ పార్టీ అవకాశం




ఇచ్చిందన్నారు. మోదీ పరివార్‌తో ఉండాలో.. గాంధీ పరివార్‌తో ఉండాలో మీరే నిర్ణయించుకోండన్నారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ అధికారంలోకి తీసుకొచ్చేందుకు మైనారిటీలు కృషి చేయాలని పిలుపిచ్చారు. దేశంలో కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, మహారాష్ట్రలో మహావికాస్ అగాడి కూటమిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. దేశంలో మోదీని ఓడించి రాహుల్



గాంధీని ప్రధానిగా చూసే వరకు విశ్రమించొద్దని సీఎం రేవంత్ రెడ్డి పిలుపిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో వైఎస్సార్ ప్రభుత్వం 4శాతం రిజర్వేషన్లు ఇచ్చిందని అన్నారు. వాటిని తొలగించేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపించారు.మోదీ వర్గం గెలిస్తే మైనార్టీలకు రక్షణ ఉండదని అన్నారు. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న మహారాష్ట్ర, జార్ఖండ్?లో ఉన్న స్నేహితులకు, బంధువులకు కాంగ్రెస్‌ను గెలిపించాలని చెప్పాలని కోరారు. మోసాల బజారులో ప్రేమ దుకాణం తెరిచేందుకే రాహుల్ గాంధీ కన్యకుమారి నుంచి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేశారని చెప్పారు. ఈ సందర్భంగా చార్మినార్ వద్ద జాతీయ జెండా ఎగురవేసి, హిందూ, ముస్లిం భాయి భాయి అని చాటారని చెప్పారు. అప్పుడు మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ కూడా సద్భావన యాత్ర సందర్భంగా చార్మినార్ వద్ద జెండా ఎగరవేశారని గుర్తు చేశారు. గాంధీ కుటుంబం భారతదేశంలోని అన్ని వర్గాలను కలుపుకొని పోతుందని అన్నారు. ప్రాంతీయ పార్టీల ముసుగులో షేర్వానీ వేసుకొని మీ మధ్య కూర్చొని బిర్యానీ తిన్నవాళ్లను నమ్మొద్దంటూ పరోక్షంగా కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. ఇక్కడ గెలిచిన వాళ్లు ఢిల్లీ వెళ్లి మోదీకి మద్దతు ఇస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం మహారాష్ట్ర, జార్ఖండ్‌లో కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాలు గెలువాలని అన్నారు.

# జనగణనతో పాటు సమగ్ర కుల గణన చేపట్టాలి

- దేశవ్యాప్త కులగణను ఎందుకు బీజేపీ చేపట్టలేదు
- బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు రాజకీయాలు ప్రజలు గమనిస్తున్నారు
- వర్ధన్నపేట మండల యువజన కాంగ్రెస్ నాయకులు కుల్ల యాకాంతం



వర్ధన్నపేట, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): కేంద్రంలోని బిజెపి పార్టీ 2025 లో చేపట్టబోయే జనగణనతో పాటు సమగ్ర కుల గణన చేపట్టాలని వర్ధన్నపేట మండల యువజన కాంగ్రెస్ నాయకులు కుల్ల యాకాంతం అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆదేశానుసారం సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా ఓబీసీ కులాల జనాభా, చట్ట సభలలో బీసీ రిజర్వేషన్లు, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన, సమగ్ర కుటుంబ సర్వే చేయడం యావత్ తెలంగాణ ప్రజలు హర్షించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. కుల గణనలో బీసీ కులాల ప్రజలు, యువకులు, ఉద్యోగస్తులు, మేధావులు, బీసీ కుల సంఘ నాయకులు కుల గణన సర్వేలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సర్వేకు ప్రజలందరూ ఎన్యుమిలేటర్లకు సహకరించాలని కోరారు. కుల గణన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా 139 బీసీ కులాలకు చెందిన ప్రజలు ఎక్కడికక్కడ తమ తమ కులాల జనాభా లెక్కల వివరాలను ఇంటింటికి వచ్చే ఎన్యూమిలెటర్లకు సమగ్ర కులాల వివరాలు అందజేయాలని కోరారు. కుల జనగణన జరిగితే బిజెపి పార్టీలోని ఆధిపత్య కులాలకు చెందిన నాయకుల గ్లోబల్ ప్రచారాన్ని తిప్పి కొట్టి హిందూ సహజ ఐక్యత దెబ్బతినకుండా హిందూ ప్రజల ఐక్యత చాటాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ ప్రజల జనాభా లెక్కలు లెక్కించి, వారి స్థానాలకు రిజర్వేషన్లు కేటాయించి, వారికి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇస్తుంటే, హిందూ సమాజం యొక్క ఐక్యత దెబ్బతింటుందని అనడం సిగ్గుచేటు అన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర బీజేపీ నాయకులు ఆలోచించాలని హితువు పలికారు. అసెంబ్లీలో పార్లమెంటులో ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ స్థానాలలో నిలబడిన బిజెపి అభ్యర్థులకు ఓట్లు వేయడం లేదా? అటూ ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కుల గణనకు ఆటంకాలు సృష్టించే, ఆధిపత్య కులాల శక్తుల పట్ల బీసీ కులాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల సమస్యలను గాలికి వదిలేసి, 10 సంవత్సరాలు ఫామ్ హౌస్ లో పడుకున్న రాజకీయ అజ్ఞాతవాసి బిఆర్ఎస్ ప్రతిపక్ష నేత కెసిఆర్ అన్నారు. తెలంగాణ ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అడ్డం పెట్టుకొని, కుటుంబ పాలన నడిపి లక్షల కోట్లు కొల్లగొట్టిన దుర్మార్గుడు కేసీఆర్ అన్నారు. తెలంగాణ సమాజంలో దాదాపు 93 శాతం ఉన్న బహుజనులు 65 శాతం పైగా ఉన్న బీసీ కులాల కుల గణన రాష్ట్ర ప్రభుత్వం చేస్తుంటే, 10 సంవత్సరాలు తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉండి రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించకుండా ఫామ్ హౌస్ లో మొద్దు నిద్రపోతున్న కేసిఆర్ ప్రతిపక్ష నాయకుడిగా అనర్హుడని అన్నారు. సమగ్ర కుల గణనను వ్యతిరేకిస్తున్న బీజేపీని బీసీ కులాల ప్రజలు నిలదీయాలన్నారు. 2014 కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాకముందు దేశవ్యాప్తంగా సమగ్ర కుల గణనకు డిమాండ్ చేసిన బీజేపీ పార్లమెంటులో ఆందోళన చేసింది. అధికారంలోకి వచ్చాక కుల గణన కాదు కదా 15 శాతం ఉన్న అగ్రకులాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించారు. 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే, తెలంగాణలో బీసీని ముఖ్యమంత్రి చేస్తానని ప్రకటించిన బీజేపీ, బీసీ కుల గణనకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లను సమర్థిస్తున్నది మరి బీజేపీ దేశవ్యాప్త కుల గణను ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర బీజేపీ నాయకత్వం కేంద్రంలో ఉన్న బీజేపీ నేతలను ప్రశ్నించడం లేదని, తెలంగాణ ప్రజలు, బీసీ ప్రజలు ఆలోచన చేయాలని అన్నారు. ఈ రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు రాజకీయాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్న సంగతి గుర్తుంచుకోవాలని అన్నారు.

# వర్ధన్నపేట మైనార్టీ పాఠశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు







వర్ధన్నపేట, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ వసుకుల రాజు ఆధ్వర్యంలో సోమవారం భారతరత్న పురస్కార గ్రహీత కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబ్దుల్ కలాం ఆజాద్ 136 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా వర్ధన్నపేట మున్సిపల్ చైర్ పర్సన్ అంగోతు అరుణ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారత దేశంలోని విద్యా వ్యవస్థలో పలు మార్పులు తెచ్చిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయం అన్నారు. విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఆజాద్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రతి సంవత్సరం నవంబర్ 11వ, తేదీన జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక రచయితగా, కవిగా, ఉద్యమ నేతగా, విద్యావేత్తగా, రాజకీయవేత్తగా అనేక సేవలందించారని మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు చేసిన నాటక ప్రదర్శన, పాడిన పాటలు పాఠశాల ఆవారణమంతా అలరించాయి. అదేవిదంగా ఉపన్యాసాలు, వ్యాసరచన, పోటీలలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, షిల్డ్ లు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ తోటకూరి రాజమణి, మండల విద్యా శాఖ అధికారి శ్రీధర్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.







# కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి చిన్న పత్రికల పాత్ర కీలకం

- ప్రజా సమస్యలు వెలుగులోకి జర్నలిస్టులే తీసుకువస్తారు
- ప్రస్తుతం జర్నలిస్టులే దయనీయ పరిస్థితిలో ఉన్నారు
- ప్రోత్సహించిన జర్నలిస్టులను ఆదుకొని తెలంగాణ అస్తిత్వాన్ని నిలబెట్టాలి
- చిన్న పత్రికల ఎంపానెల్మెంట్ వెంటనే చేపట్టాలి
- జర్నలిస్టుల సంక్షేమ పథకాలు ప్రభుత్వమే ప్రత్యక్షంగా ఇవ్వాలి
- తెలంగాణ మీడియా పాలసీ ప్రకటించాలి
- తెలంగాణ ప్రెస్ మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
- ఎన్.యు.జె. జాతీయ ఉపాధ్యక్షులు పురుషోత్తం నారగౌని
- జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా కాంబ్లే బాలాజీ




కామారెడ్డి, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర ఆరావిర్భావం కోసం, కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి కీలక పాత్ర పోషించిన చిన్న పత్రికలు (స్థానిక పత్రికల) సమస్యల పై ప్రభుత్వం వెంటనే స్పందించి, గత ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఎంపానెల్మెంట్ వెంటనే చేపట్టి, ఋణభారంతో బ్రతుకులీడుస్తున్న పాత్రికేయులను ఆదుకోవాలని జాతీయ జర్నలిస్ట్ యూనియన్ (ఎన్.యు.జె.(ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు పురుషోత్తం నారగౌని అన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ కామారెడ్డి జిల్లా కమిటీ ఎన్నిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ అధ్యకతన సోమవారం రోజున జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎన్.యు.జె. జాతీయ ఉపాధ్యక్షులు పురుషోత్తం నారగౌని ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజాస్వామ్య విలువలు కాపాడడం లోనూ, ప్రజా సమస్యలు వెలుగులోకి తీసుకురావడమే కాకుండా వాటి పరిష్కారానికి కూడా కృషి చేస్తున్న చిన్న పత్రికల పరిస్థితి చాలా దయనీయంగా ఉందన్నారు. గత ప్రభుత్వం ఎన్నో ప్రమాణాలు చేసినప్పటికీ ఒక్కటి అమలుకు నోచు కోలేదని, వందలాది చిన్న పత్రికలు ఎంపానెల్మెంట్ లేక ప్రభుత్వ ప్రకటనలు రాకపోవడంతో ఆయా పత్రికల యాజమాన్యాలు దుర్భరపరిస్థితి ఎరుకొంటున్నాయని అన్నీ విషయాలు స్పష్టంగా తెలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే వాటిని ఆదుకొని తెలంగాణ అస్తిత్వాన్ని నిలబెట్టాలని అన్నారు. ప్రభుత్వం వెంటనే పట్టించుకుని, ఆర్థిక సహాయ ప్యాకేజీలను ప్రకటించాలని ఆయన కోరారు. తెలంగాణ మీడియా పాలసిని ప్రకటిండం, తెలంగాణ ప్రెస్ అండ్ మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఇంకా తెలంగాణ భూమి పుత్రులైన పాత్రికేయులకు మాత్రమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని, వారు తమ జీవితాన్ని పత్రికా రంగానికి అంకితం చేసి, ప్రజల గొంతుకగా నిలుస్తున్నారన్నారు. జర్నలిస్టు స్కీమ్ లలో యూనియన్ల పాత్రను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టి.ఎస్.జె.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న యూనియన్లు జర్నలిస్టుల సంక్షేమం కోసం కాకుండా, తమ వ్యక్తిగత ప్రయోజనాలకే పరిమితమయ్యాయని, అలా కాకుండా తాము ఒక ప్రత్యామ్నాయ జర్నలిస్టు ఉద్యమ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ఇంకా ఈ సమావేశంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బాపిరెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

**కామారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు**

జిల్లా అధ్యక్షులుగా బోకల వేణు, ఉపాధ్యక్షులుగా నిస్సి సామ్ సన్, కుంటోళ్ల యాదయ్య, సాయిబాబా, ప్రధాన కార్యదర్శిగా రావులపల్లి మధు, సంయుక్త కార్యదర్శిగా బాలవంతుల శ్రావణ్, కోశాధికారిగా సాంకే నారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులుగా కాంబ్లే బాలాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎండి. ఇలియాస్, సంయుక్త కార్యదర్శిగా సీనియర్ పాత్రికేయులు కౌసర్ అలీ ఎన్నికయ్యారు.

# సైబర్ నేరాల అధికమవుతున్నాయి

- ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి - వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య



వర్ధన్నపేట, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం సైబర్ నేరాలు, 100 డయల్ ప్రాముఖ్యత, రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎస్సై రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో భాగంగా ఏసిపి అంబటి నర్సయ్య మాట్లాడుతూ సైబర్ నేరాలు అధికమౌతున్నాయని అన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ విషయమై విద్యార్థులు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మి పోసపోవద్దని, ఎవరైనా బ్యాంకు అకౌంట్, ఆధార్, పాన్ కార్డు, ఓటీపీ వంటి వివరాలు అడిగినట్లయితే వారికి ఎలాంటి వివరాలు తెలపకూడదని చెప్పారు. ఏ సందర్భంలోనైనా అనుమానాస్పదంగా కనిపించినా, అనిపించినా వెంటనే 100 డయల్ కు ఫోన్ చేసి, పోలీసులకు సమాచారం అందజేయాలని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాల భారిన పడకుండా ద్విచక్ర వాహనదారులు నడిపేటప్పుడు తలకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కారు డ్రైవింగ్ చేసే సమయంలో సీట్ బెల్ట్ ధరించి డ్రైవింగ్ చేయాలన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే, జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో అధ్యాపకులు, పోలీస్ కానిస్టేబుల్లు పాల్గొన్నారు.

# రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోలు నిర్వహించాలి

- వర్ధన్నపేట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు



వర్ధన్నపేట, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోలు కేంద్రాలు నిర్వహించాలని సోమవారం వర్ధన్నపేట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ అన్నారు. వారి వెంట మాజీ జడ్పీటీసీ సభ్యులు కమ్మగోని ప్రభాకర్ గౌడ్, సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్ కలిసి వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న పరిస్థితులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇంచార్జ్ ఈద శిరీష, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రాజు, నాంపల్లి యాదగిరి, బీసీ విభాగం నాయకులు మెరుగు రాజాలు గౌడ్, మహిళా సంఘాల సభ్యులు మామిండ్ల రజిత, ఒగ్గుల మాధవి, మెరుగు రజిత, గజ్జెల్లి జ్యోతి, దుబ్బ కవిత, గడ్డం రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నూతన మీడియా పాలసీని ప్రకటించాలి

- తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు నాగేందర్ మాదిగ



హైదరాబాద్, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 239 ని రద్దుచేసి, నూతన మీడియా పాలసీని ప్రకటించాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల నాగేందర్ మాదిగ కోరారు. సోమవారం హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర పౌర సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ డీఎస్ జగన్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ఇంటి స్థలాలపై నిర్దిష్టమైన పాలసీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. యూట్యూబ్ చానల్స్, చిన్న పత్రికలు వాటి స్థితిగతులను పరిశీలించి, అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. హెల్త్ కార్డులను అన్ని కార్పోరేట్, ఇతర ప్రైవేట్ ఆసుపత్రులలో చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. జర్నలిస్టుల పిల్లలకు కేజీ టు పీజీ ఉచిత విద్యను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో అందించాలని విజ్ఞప్తి చేశారు. అక్రిడిటేషన్ కమిటీల్లో అన్ని జర్నలిస్టు సంఘాలను భాగస్వామ్యం చేసి, వారి సూచనలను పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులపై దాడులను నిరోధించేందుకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని అన్నారు. వారి వెంట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కల్లపల్లి రాజేందర్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి సుక్క అశోక్ మాదిగ, రాష్ట్ర నాయకులు పెండెల సుమన్, బాలకృష్ణ, భాస్కర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

- అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి





రాయపర్తి, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): క్రీడలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అడిషనల్ కలెక్టర్ విజయ లక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహిస్తున్న 10వ, జోనల్ స్థాయి క్రీడలను మల్టి జోనల్ అధికారిని అలివేలుతో కలిసి క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువు తోపాటు క్రీడలలో రాణించాలని, క్రీడాకారులు క్రమ శిక్షణతో మెలిగి ఉన్నత శిఖరాలకు చేరాలని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వాన్ని దోహదపడతాయని అన్నారు. క్రీడ పోటీలలో గెలుపు, ఓటములు సహజమని తెలిపారు. గురుకులాల్లో చదివే విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డిసిఓ అపర్ణ, హనుమకొండ డిసిఒ ఉమామహేశ్వరి, ప్రిన్సిపల్ సరిత, సమ్మయ్య, లీల, కలమ్మ, రమ్య, సుధ, కల్పన, వేణు, వివిధ గురుకులాల ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వార్త
RNI NO:Title-Code:-TELTEL02102
అనుక్షణం ప్రజల పక్షం... తెలుగు దిన పత్రిక



# అబ్దుల్ కలాం ఆజాద్ 137వ, జయంతి వేడుకలు

**- ఆజాద్ చిత్రపటానికి నివాళులు అర్పించిన కలెక్టర్**





వరంగల్ బ్యూరో, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం అబ్దుల్ కలాం ఆజాద్ 137వ, జయంతిని జిల్లా మైనారిటీ శాఖ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి పాల్గొని అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా వారి జయంతి వేడుకలను పురస్కరించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఆజాద్ దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన మహనీయులని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో, అదనపు కలెక్టర్ (ఇంచార్జ్ )విజయలక్ష్మి, ఆర్డీవో ఉమారాణి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రమేష్, డిఆర్డిఓ పిడి కౌశల్య దేవి, జెడ్పిసిఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీ కార్యకర్తకు సముచిత స్థానం దక్కింది

**- తెలుగు యువత నాయకులు అన్వేష్**



వర్ధన్నపేట, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు డైరెక్టర్ నన్నూరి నర్సిరెడ్డిని తెలుగు యువత మండల నాయకులు మినుముల అన్వేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్ లోని ఎన్టీఆర్ భవన్ లో నూతనంగా తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు డైరెక్టర్ గా నియమితులైన నన్నూరి నర్సిరెడ్డిని కలిసి శాలువా కప్పి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ టీడీపీలో పార్టీ బలోపేతం కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం దక్కుతుందని అన్నారు. అందుకు నిదర్శనమే నర్సిరెడ్డి నియామకం అన్నారు.

# వినతులు స్వీకరించిన మంత్రి సురేఖ



వరంగల్ బ్యూరో, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): ప్రజల వినతులను పరిశీలించి, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల సహకారంతో సాధ్యమైనంత త్వరలో వారి సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం వరంగల్ ఓ సిటీలోని క్యాంప్ ఆఫీస్ కార్యాలయంలో మంత్రి సురేఖ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా పలు డివిజన్లకు చెందిన ప్రజలు, పార్టీ శ్రేణులు క్యాంప్ ఆఫీసు కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను మంత్రికి వివరించారు. అధికారులతో ఫోన్ లో మాట్లాడి చాలా వరకు సమస్యలను మంత్రి సురేఖ అక్కడికక్కడే పరిష్కరించారు. గతంలో అధికారులకు నివేదించి, పరిష్కారానికి నోచుకోని విజ్ఞప్తులపై ఆరా తీసిన మంత్రి, సంబంధిత అధాకారులతో ఫోన్ లో మాట్లాడి వెంటనే ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. గతంలో వచ్చిన దరఖాస్తులు, వాటిలో పరిష్కారానికి నోచుకున్నవి, పలు కారణాలతో పెండింగ్ లో వున్న దరఖాస్తుల పై మంత్రి సురేఖ ఆరా తీశారు. ఆయా శాఖల అధికారులతో మాట్లాడి ప్రాధాన్యత క్రమంలో దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మంత్రి సురేఖ ఓపిగ్గా తమ సమస్యలను విని పరిష్కారం చూపినందుకు ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి ప్రజలే ప్రథమ ప్రాధాన్యమని, ప్రజల సంక్షేమమే పరమావధి అని మంత్రి సురేఖ పునరుద్ఘాటించారు. వరంగల్ తూర్పులోనూ, హైదరాబాద్ లోనూ ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో వుంటానని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# వరంగల్ నగరంలో సర్వే తీరును పరిశీలించిన కలెక్టర్

**- సమగ్ర కుటుంబ సర్వేపై సందేహాలు వద్దు - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి**

వరంగల్ బ్యూరో, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ కులగణన సర్వేపై సందేహాలు, అపోహాలు అవసరం లేదని, ప్రజలు సర్వే ప్రక్రియలో భాగస్వాములై తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి సూచించారు. సోమవారం వరంగల్ నగరం జిడబ్ల్యూ ఎంసీలోని 24వ, డివిజన్ ఫాటక్ మోహల్లా, ఎల్లంబజార్ లలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే తీరును క్షేత్ర స్థాయిలోకలెక్టర్ పరిశీలించారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరిస్తున్న తీరును, నిర్ణీత ఫారాలలో ఆయా కోడ్ ల వారీగా వివరాలు నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ, ఇంటింటి కుటుంబ సర్వేలో సమగ్ర సమాచారాన్ని సేకరించాలని, వారు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి సేకరించిన సమాచారం గోప్యంగా ఉంచడం



జరుగుతుందని అన్నారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా జిల్లాలో సమగ్ర ఇంటింటి సర్వే కొనసాగుతోందని, ప్రజల నుండి సేకరించిన సమాచారాన్ని డేటా ఎంట్రీ ఆపరేటర్ల ద్వారా ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేసేవిధంగా చర్యలు తీసుకున్నామన్నారు. వారి వెంట జెడ్పి సీఈఓ రామిరెడ్డి, సిపిఓ గోవిందరాజన్, ఉప కమిషనర్ కృష్ణారెడ్డి, ఆర్ ఓ షాజాదిబేగం, ఆర్ ఐ సోహైల్, గణకులు తదితరులు ఉన్నారు.





# స్వీకరించిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలి

**- అధికారులను ఆదేశించిన వరంగల్ జిల్లా కలెక్టర్**



వరంగల్ బ్యూరో, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి, ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవితో పాటు అదనపు కలెక్టర్ ఇన్చార్జ్ విజయలక్ష్మి, ఆర్డీవో ఉమరాణి, డిఆర్డిఓ కౌసల్య దేవి, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలపైన వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం దరఖాస్తులు 95 రాగా వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కువగా రెవెన్యూ భూ సంబంధిత సమస్యల పై దరఖాస్తులు వచ్చాయి. అందులో ఎక్కువ దరఖాస్తులు రెవెన్యూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు 45 వచ్చాయని కలెక్టరేట్ కి సంబంధించిన దరఖాస్తులు 10, జిల్లా ఉపాది శాఖకి 6 చొప్పున వచ్చాయని తెలిపారు. మిగతా వివిధ శాఖలకు సంబంధించిన పలు రకాల సమస్యలపైన దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిని సంబంధిత శాఖల జిల్లా అధికారులకు ఎండార్స్మెంట్ చేస్తూ తరగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వారం వారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలని, వెంట వెంటనే పరిష్కరించి ప్రజలకు ప్రభుత్వం మీద నమ్మకాన్ని పెంచేదిగా ఉండాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పల్లె దావఖానా వైద్య సిబ్బంది నియామకం

**- నియమాకపత్రాలను అందించిన జిల్లా కలెక్టర్**







వరంగల్ బ్యూరో, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): ఉద్యోగ నియామకాలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు, కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్ వరంగల్ అనుమతితో సోమవారం జిల్లా పరిషత్ వరంగల్ మీటింగ్ హాల్లో కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అధ్యక్షతన ఇద్దరూ పల్లె దవాఖాన డాక్టర్లను 13 మంది స్టాఫ్ నర్స్ లను ఆర్ ఓ ఆర్ నిబంధనలతో నియమించారు. ఈ నియామక కమిటీలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి ,డి డబ్ల్యు ఓ రాజమణి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ రామ్మూర్తి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు సభ్యులుగా వ్యవహరిస్తూ ఉద్యోగ నియమాకాలను పూర్తి చేశారు. అనంతరం కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ వరంగల్ డాక్టర్ సత్య శారదా దేవి చేతుల మీదుగా నియామక పత్రాలు అందించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో నియామక కమిటీ సభ్యులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నాటు సారాయి, రెండు ద్విచక్ర వాహనాలు పట్టివేత



చెన్నారావుపేట, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): నాటు సారాయి రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. మండల పరిధిలోని ఈర్య తండా నుండి చెన్నారావుపేటకు చేసున్న నాటు సారాయి రవాణా ఎక్సైజ్ అధికారులు అడ్డుకున్నారు. సారాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులు, 2 ద్విచక్ర వాహనాలు, 12 లీటర్ల నాటు సారాయి అదుపులోకి తీసుకున్నట్లు సోమవారం ఎక్సైజ్ సిఐ నరేష్ రెడ్డి వివరించారు. ఈ క్రమంలో ఈర్య తండాకు చెందిన ధరంసోతు వెంకన్న, ముద్దుపురంకు చెందిన ఇస్లావత్ భరత్ లపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. వారి వెంట ఎస్ఐలు శార్వాణి, రాజన్న, సిబ్బంది లింగేశ్వర్, వాజిద్, లింగస్వామి, స్వర్ణలత, నాగరాజు, దిలీప్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

# సికెఎమ్ హాస్పిటల్లో ఆకస్మిక తనిఖీ

**- తెలంగాణ కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆర్వి కర్ణన్ ఐఏఎస్**



వరంగల్ బ్యూరో, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ నగరంలోని సికెఎమ్ హాస్పిటల్ కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ తెలంగాణ ఆర్వి కర్ణన్ ఐఏఎస్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వారి వెంట వరంగల్, హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ బి సాంబశివరావు, డాక్టర్ అప్పయ్య, సి కె ఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ పర్యవేక్షించారు. కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ తెలంగాణ ఆర్వి కర్ణం ఐఏఎస్ మాట్లాడుతూ సీకేఎం హాస్పిటల్లో ఎక్కువమంది పీజీ డాక్టర్లు ఉన్నారు. కాబట్టి ఇన్స్టిట్యూషనల్ డెలివరీస్ ఎక్కువ పెంచాలని, పరిసరాల పరిశుభ్రతను సక్రమంగా నిర్వహించాలని, మాతా శిశు సంరక్షణ కొరకు ప్రభుత్వము అందిస్తున్న సేవలు ప్రజలకు అందించాలని, ఎలాంటి సమస్యలున్నా వెంటనే హాస్పిటల్ అభివృద్ధి కమిటీ తో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వరంగల్, కలెక్టరేట్ మెజిస్ట్రేట్ వరంగల్ వారి సమన్వయంతో పరిష్కరించి, ఉన్నతమైన సేవలు అందించి, మాత శిశు మరణాలు లేకుండా చూడాలని తెలిపినారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ అప్పయ్య, డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ మోహన్ సింగ్, సీకేఎం హాస్పిటల్ ఆర్ ఎం ఓ, వైద్యాధికారులు, డిప్యూటీ డెమో అనిల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.ం

# బాధిత కుటుంబాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చేయూత



రాయపర్తి, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం పెరికేడు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు నల్ల వెంకన్న భార్య నల్ల ఎల్లమ్మ, సుతారి లక్ష్మి కాంత్ భార్య సుతారి యశోదలు ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు. సోమవారం సమాచారం తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి, క్వింటా బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అనంతరం పెరికేడ్ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన చాందుబి అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందజేసి, అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ ఉపాధ్యక్షులు ఎండీ నయీమ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు జాజు నాయక్, చిన్నల రాజబాబు, బండి రాజబాబు, లేతకుల మహేందర్ రెడ్డి, బద్దం వేణుగోపాల్ రెడ్డి, వీరస్వామి, భాషబోయిన సుధాకర్, కోలా సంపత్, గబ్బేట యాకయ్య, అంజాద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ పై భౌతికంగా దాడికి పాల్పడిన వారిని కేసు నమోదు చేయాలి

**- ఇలాగైతే మిగతా ఉద్యోగులకు దిక్కెవరు?**

**- ఐనవోలు ఆర్ఐ అధికారి మరుపట్ల మల్లయ్య**

హనుమకొండ, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఇతర అధికారులపై భౌతికంగా దాడి చేయడం అమానుషమని సోమవారం తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మరుపట్ల మల్లయ్య అన్నారు. ఫార్మా కంపెనీ ఏర్పాటుపై రైతులతో చర్చించేందుకు స్వయంగా జిల్లా కలెక్టర్ వస్తే వారిపైనే దౌర్జన్యానికి పాల్పడితే మిగతా ఉద్యోగులకు దిక్కెవరని వ్యాఖ్యానించారు. అధికారులతో పాటు వాహనాలను ధ్వంసం చేసిన వారిపై తక్షణమే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి, దౌర్జన్యానికి పాల్పడిన వారిని తక్షణమే ఆరెస్ట్ చేసి, శాఖపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు మరేక్కడా మళ్ళీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొదమళ్ళ రవి పిలుపు మేరకు హనుమకొండ జిల్లా కేంద్రం,మరియు రెవిన్యూ డివిజన్ కేంద్రములు మరియు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలలో నల్ల బాడ్జీలతో నిరసన కార్యక్రమములు చేపట్టాలని పిలుపునిచ్చారు.

# ఇష్టారాజ్యాంగ మద్యం రవాణా

**- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు**



**పర్వతగిరి, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని వైన్ షాపుల యజమానులు ఆర్డర్లపై గ్రామాల్లో బెల్ట్ షాపులకు ఎమ్మార్పీ కంటే ఎక్కువ వసూలు చేసుకుంటూ మద్యం సరఫరా చేస్తున్నారు. మండలంలో మొత్తం ఆరు మద్యం షాపులు ఉండగా చుట్టుపక్కల గ్రామాలు, తండాలకు ఆర్డర్లపై ఆటోలలో ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకొని, మద్యం సరఫరా చేస్తున్నారు. సోమవారం చింత నెక్కొండకు చెందిన వైన్ షాప్ యజమానులు చౌటపల్లిలో వివిధ షాపులకు ఆర్డర్లపై ఆటోలో మధ్యాన్ని సరఫరా చేస్తున్నారు. స్థానిక ఎక్సైజ్ ఆఫీసర్లు ఇంత జరుగుతున్న మామూళ్ల మత్తులో పడి, షాపు యజమానులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానిక ప్రజలు చర్చిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ డిటిఫ్, ఎస్ టి ఎఫ్ ప్రత్యేక తనిఖీ బృందాలు బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేయాలని, బెల్ట్ షాపులను పూర్తి స్థాయిలో కనుమరుగయ్యేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# భద్రకాళి దేవాలయంలో కార్తీక దీపోత్సవం

## - ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి కొండా




వరంగల్ బ్యూరో, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయా శాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం భద్రకాళి దేవాలయంలో కార్తీక దీపోత్సవం, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేవాలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ లాంఛనాలతో సాదర స్వాగతం పలికారు. భద్రకాళి దేవస్థానం ప్రధానార్చకులు భద్రకాళి శేషు మంత్రికి వేదాశీర్వచనం, అమ్మవారి తీర్థప్రసాదాలను అందంజేశారు. అనంతరం మంత్రి సురేఖ భక్తులతో కలిసి కార్తీక దీపాలను వెలిగించారు. పలువురు భక్తులకు వాయనాలు ఇచ్చారు. పూజా కార్యక్రమాల అనంతరం వేదపాఠశాల విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ హిందూ సంస్కృతిలో కార్తీక మాసానికి ఎంతో ప్రశస్తి వున్నదని అన్నారు. అందుకే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సామూహిక కార్తీక దీపోత్సవాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలపారు. దీపం జ్యోతి పరబ్రహ్మ అని అంటారనీ, అందుకే కార్తీక మాసంలో దేవుని సమక్షంలో దీపాన్ని వెలిగించడం ఎంతో శుభప్రదమైనదిగా భక్తులు భావిస్తారనీ మంత్రి పేర్కొన్నారు. కార్తీక మాసం శివవైష్ణవులకు ఎంతో ప్రత్యేకమని, కార్తీక మాసంలో చేసే దీపారాధన వల్ల పూర్వజన్మలో చేసిన పాపాలు తొలిగి, శుభం జరుగుతుందని భక్తుల నమ్ముతారని తెలిపారు. హిందూ సమాజం నేడు ప్రతి పండుగను ఎంతో దేదీప్యమానంగా జరుపుకోవడం శుభసూచకమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందిస్తున్నదని మంత్రి తెలిపారు. భద్రకాళి దేవాలయానికి అనుబంధంగా వున్న వేదపాఠశాల విద్యార్థుల సంక్షేమానికి చర్యలు చేపడతామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# పంటలు కొల్పోతున్నామని కలెక్టర్ కు పిర్యాదు

## - చెరువు వద్ద మరమ్మత్తు పనులు చేపట్టాలి - రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి



పర్వతగిరి, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): మండల కేంద్రంలోని పెద్ద చెరువు రిజర్వాయర్, పోలకమ్మ చెరువు మధ్యలో ఉన్న 100 ఎకరాల పట్టా భూములు కలిగి ఉండి వరదనీరుతో నష్టపోతున్న రైతులు సోమవారం జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవిని కలిశారు. ఈ సందర్భంగా తమకు న్యాయం చేయాలంటూ వారికి వినతి పత్రం సమర్పించారు. గత మూడు సంవత్సరాలుగా తమ భూముల్లో పంటలు సాగు చేయలేకపోతున్నాం, పర్వతగిరి పెద్ద చెరువు రిజర్వాయర్ తూములు సరిగ్గా నిర్మించకపోవడం వల్ల వృధాగా పోయే పెద్ద చెరువు నీరు వల్ల తమ పంట పొలాలు ముంపుకు గురవుతున్నాయి. దాని కారణంగా గత మూడు సంవత్సరాల నుండి రైతులకు జీవనాధారమైన కొద్ది భూమిని సాగు చేసుకోలేక పోతున్నామని ఆరోపించారు. పెద్ద చెరువు తూముల్లో నుండి వృధాగా పోలకమ్మ చెరువులోకి వచ్చిన నీరు పోలకమ్మ చెరువు సుందరీకరణ పనుల వల్ల చెరువు రెండు తూములు మూసుకుపోయాయి. అందువల్ల పెద్ద చెరువు నుండి పోలకమ్మ చెరువులోకి వచ్చిన నీటి కారణంగా చెరువు మీద ఉన్న పంట పొలాలన్నీ నీట మునిగి రైతులంతా నష్టపోతున్నారు. రైతుల సమస్యలు పరిష్కరించే దిశగా పెద్ద చెరువు రిజర్వాయర్ తూములు (షటర్లు) సరిగ్గా నిర్మించాలి, పోలకమ్మ చెరువుకు ఉన్న రెండు తూములను నీరు విడుదల అయ్యే విధంగా మరమ్మతులు చేయించాలి, పోలకమ్మ చెరువు చిన్న మత్తడికి పూర్వం ఎస్సీ కాలనీ పక్కనే ఉన్న బుంగను పునర్నిర్మించాలి, ఇష్టానుసారంగా పెద్ద చెరువు నీటిని చేపల వేటకు విడుదల చేస్తున్న మత్స్యకారులపై చర్యలు తీసుకోవాలని, మరోసారి ఇలాంటి సమస్యల పునరావృతం కాకుండా చూడాలి, పూర్వం ఉన్న పెద్ద చెరువు రిజర్వాయర్ నుండి పోలకమ్మ చెరువు వరకు ఉన్న పంటలకు నీటి వసతి కల్పించి, కాలువను సీసీతో పునరుద్ధరించాలను రైతులు కోరారు. పిర్యాదు చేసిన వారిలో సింగారపు రమేష్, చిన్న పెల్లి దేవేందర్, బోట్ల కనకరాజు, ఆర్షం యుగంధర్, సంకినేని పూలమ్మ, బోట్ల వెంకన్న, కాసర్ల ప్రభాకర్, బొట్ల రమేష్, ఆర్షం యాకయ్య, బోట్ల పుష్పమ్మ, బొట్ల పూల, లింగారపు ఉప్పలమ్మ,సింగారపు నర్సెల్లు, ఆకుల పెల్లి యాకయ్య,చిర్ర సుమన్ తదితరులు ఉన్నారు.

# ఫార్మాసిటీతో వ్యవసాయానికి ఉరి

## పచ్చని పంటపొలాలు ధ్వంసం చేయడం దారుణం

### వికారాబాద్ ఘటనపై మండిపడ్డ హరీష్ రావు




హైదరాబాద్, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): వికారాబాద్ జిల్లా ఫార్మాసిటీ ఘటనపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. గరీబీ హటావో అని ఇందిరా గాంధీ గారు పిలుపునిస్తే.. ఫార్మా సిటీ పేరుతో పచ్చని పంట పొలాల నుంచి కిసాన్ హటావో అని పిలుపు నిస్తున్నారు రేవంత్ రెడ్డి అని విరుచుకుపడ్డారు. రేవంత్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా తయారైందని అన్నారు. ఆ రాయి ఈరోజు ముఖ్యమంత్రి సొంత జిల్లా అయిన వికారాబాద్ రైతన్నల నెత్తిన పడిందన్నారు. అందుకే రైతులు రేవంత్ మీద ఉన్న కోపాన్ని జిల్లా కలెక్టర్, ప్రభుత్వ అధికారుల మీద చూపుతున్నారని తెలిపారు. ÷శివంత్ చేస్తున్న అసమర్థ పాలనకు ఐఎస్ లు, ప్రభుత్వ అధికారులు ప్రజాగ్రహానికి గురవుతున్నారని తెలిపారు. ఫార్మా సిటీ కోసం కేసీఆర్ హైదరాబాద్‌కు దగ్గరగా కాలుష్యం లేకుండా జీరో వ్యర్థాలతో 15 వేల ఎకరాలు సేకరించి సిద్ధం చేసినట్లు తెలిపారు. పర్యావరణం, అటవీ సహా అన్ని రకాల అనుమతులు వచ్చిన దాన్ని పక్కన బెట్టి పచ్చటి పొలాల్లో ఫార్మా చిచ్చు బెడుతున్నారంటూ మండిపడ్డారు. జహీరాబాద్ న్యాల్కల్ మండలంలోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉందన్నారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమిని తన రియల్ ఎస్టేట్ దందా కోసం వినియోగించే కుట్రతో ఈ సమస్య మొదలైందన్నారు. 'నీ మీద, నీ పాలన మీద తిరగబడని వర్గం ఏదైనా ఉందా రేవంత్ రెడ్డి.. ఇప్పటికైనా పిచ్చి పనులు మాని పరిపాలన మీద దృష్టి పెట్టాలని, పచ్చని పొలాల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి' అని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# తెలంగాణ జర్నలిస్టు మీడియా యూనియన్ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీగా కొప్పుల రమేష్






భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): చుంచుపల్లి మండల పరిధిలోని సిపిఐ కమ్యూనిటీ హాల్లో సోమవారం తెలంగాణ జర్నలిస్టు మీడియా యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎన్ యు జె ( ఐ ) జాతీయ అధ్యక్షులు రాజ్ బీహార్, టీజేఎంయు రాష్ట్ర అధ్యక్షులు ఐ. ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కొప్పుల రమేష్ ను నియమించడం జరిగింది. ఈ సమావేశంలో కొప్పుల రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో వారికి ఇచ్చిన బాధ్యతలకు న్యాయం చేస్తానని చెప్పారు. విలేకరులకు సంక్షేమ పథకాలు అందే విధంగా, వారికి అక్రేషన్ ఇప్పిచ్చే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో భద్రాద్రి జిల్లా అధ్యక్షులు కురుమల్ల శేఖర్, ఉపాధ్యక్షులు పత్తి బాలకృష్ణ, గొమ్లాపురం సత్యనారాయణ, ప్రవీణ్, ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నారపోగు ప్రసాద్, సైదులు, రిపోర్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

## - ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్



చెన్నారావుపేట, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): చెన్నారావుపేట మండల కేంద్రంలోని ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ భూమిలో ఉన్నటువంటి బస్టాండ్ స్థలాన్ని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంసిపిఐయు వరంగల్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం చెన్నారావుపేట తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కామ్రేడ్ రమేష్ మాట్లాడుతూ తప్పుడు రికార్డులు సృష్టించి, సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న కొమరవెల్లి సాత్విక్ అనే వ్యక్తి, వీరికి వారసత్వంగా ఇతరుల నుంచి కొనుగోలు చేసిన భూమితో పాటు ప్రభుత్వ భూమిని సైతం ఆక్రమించుకొని, నర్సంపేట నెక్కొండ ప్రధాన రహదారి పక్కన ఉన్న కొమురవెల్లి సంపత్ కుమార్ భూమికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమి ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి భావిని మిగతా ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి, ప్రహరీ గోడ నిర్మించడం దారుణం అన్నారు. అట్టి ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని, ప్రజలకు ఆ భూమిని ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. వారి వెంట ఎంసిపిఐయు చెన్నారావుపేట మండల బాధ్యులు కన్న వెంకన్న, నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, డివిజన్ నాయకులు కలకోట్ల యాదగిరి పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభోత్సవం



చెన్నారావుపేట, నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): అమీనాబాద్ సహకార సంఘం పరిధిలోని సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అమీనాబాద్, పాపయ్యపేట, ఎల్లాయి గూడెం, తిమ్మరాయుని పహడ్, గొల్ల బామతండా సెంటర్లలో ధాన్యం కేంద్రాలను చైర్మన్ మురహరి రవి, మాజీ సర్పంచ్ సిద్ధన రమేష్, జెడ్పిటిసి పత్తి నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రవి మాట్లాడుతూ ప్రభుత్వం గిట్టుబాటు ధరను కల్పిస్తూ ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు జాటోత్ స్వామి, అమీనాబాద్ మాజీ ఎంపీటీసీ కడారి సునీత సాయిలు, ఎల్లాయి గూడెం మాజీ ఎంపీటీసీ వెంకన్న, కనకమల్లు, అమీనాబాద్ మండల యూత్ ప్రెసిడెంట్ బండి హరీష్, పాపాయిపేట కంచ ప్రభాకర్, భూక్య భాస్కర్, అమీర్, నాయకులు బుర్ర సుదర్శన్, గుర్రం రవి, భాను దేవ్ సింగ్ తదితరులు ఉన్నారు.

# మానవత్వాన్ని చాటుకున్న బండి సంజయ్..




,(హుజురాబాద్): నవంబర్ 11,(జర్నలిస్ట్ వార్త): హుజురాబాద్ నియోజకవర్గం సింగాపూరం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైన యువతి.లారీ కింద ఇరుకున్న మానకొండూర్ మండలం ఖిల్లడ గ్రామానికి చెందిన యువతి దివ్య శ్రీ.ములుగు పర్యటనకు వెళ్తు ప్రమాదాన్ని చూసి తన వాహనాన్ని ఆపిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్.అటువైపు వెళుతున్న లారీలను ఆపి జాకీలు, కత్తెర తెప్పించిన బండి సంజయ్.జుట్టు కత్తిరించి యువతి ప్రాణాలను కాపాడిన స్థానికులు.గాయాలపాలైన యువతిని కరీంనగర్లోని లైఫ్ లైన్ ప్రైవేట్ ఆసుపత్రికి పంపి..చికిత్సకు అయ్యే ఖర్చును తానే చెల్లిస్తానని ఆసుపత్రి వైద్యులకు చెప్పిన బండి సంజయ్.

# పుష్ప-2 ట్రైలర్ విడుదల బీహార్ గడ్డపై...

# అల్లు అర్జున్ అనౌన్స్ మెంట్




టాలీవుడ్ హీరోలు తమ పరిధిని మరింత పెంచుకునే పనిలో పడ్డారు. రామ్ చరణ్ తన గేమ్ చేంజర్ టీజర్ ను యూపీ రాజధాని లక్నోలో విడుదల చేయగా... ఇప్పుడు అల్లు అర్జున్ కూడా ఉత్తరాదిపై కన్నేశారు. పుష్ప-2 ట్రైలర్ ను బీహార్ గడ్డపై విడుదల చేయాలని నిర్ణయించారు.

పుష్ప-2: ది రూల్ చిత్రం ట్రైలర్ ను నవంబరు 17న పాట్నాలో విడుదల చేస్తున్నామని అల్లు అర్జున్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఈ ప్రకటన వచ్చిందో లేదు, బన్నీ ఫ్యాన్స్ సంబరాలు షురూ చేశారు. ఫేస్ బుక్, ట్విట్టర్ లో ఎక్కడ చూసినా పుష్ప-2 ట్రైలర్ గురించే చర్చ నడుస్తోంది. అల్లు అర్జున్-సుకుమార్ కాంబోలో వచ్చిన పుష్ప చిత్రం ఎంతటి ఘనవిజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పుడు పుష్ప-2 మూవీ... తొలి పార్టును మించిపోయేలా ఉంటుందని చిత్రయూనిట్ కాన్ఫిడెంట్ గా చెబుతోంది. దానికి తగ్గట్టే మీడియాలోనూ, సోషల్ మీడియాలోనూ పుష్పరాజ్ బజ్ ఓ రేంజ్ లో కొనసాగుతోంది. ఇప్పుడు బీహార్ రాజధాని పాట్నాలో ట్రైలర్ రిలీజ్ ప్లాన్ చేయడం ద్వారా మేకర్స్ తమ పంథాను స్పష్టం చేశారు. ఆలిండియా లెవెల్లో ఓపెనింగ్స్ కొల్లగొట్టాలన్నదే వారి ఉద్దేశమని అర్థమవుతోంది. అందుకే పుష్ప-2 చిత్రాన్ని ఉత్తరాది ఆడియన్స్ కు మరింత చేరువ చేసేలా ఈవెంట్లు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది.

కాగా, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రం డిసెంబరు 5న వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజవుతోంది. ఇందులో అల్లు అర్జున్ సరసన రష్మిక మందన్న కథానాయిక కాగా... తొలిపార్టులో చివర్లో వచ్చి అదరగొట్టిన ఫహాద్ ఫాజిల్... సెకండ్ పార్టులో ఫుల్ టైమ్ ఊపేయనున్నాడు. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. పుష్ప చిత్రంలో సమంత ఐటమ్ సాంగ్ ఎంత హిట్టయిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు పుష్ప-2లో ఐటమ్ సాంగ్ ను శ్రీలీలపై తెరకెక్కిస్తున్నారు. 'కిస్సిక్' అంటూ సాగే ఈ సాంగ్ పై అభిమానుల్లో అంచనాలు భారీగానే ఉన్నాయి.

# సినీ కార్మికులకు శుభవార్త

## ఇళ్లు ఇప్పిస్తామని మంత్రి కోమటిరెడ్డి హామీ



టాలీవుడ్ సినీ కార్మికులకు సంబంధించి తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి శుభవార్త చెప్పారు. అర్హులైన సినీ పరిశ్రమ కార్మికులకు హైదరాబాద్ చిత్రపురి కాలనీలో ఇళ్లు ఇప్పిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అదేవిధంగా చిన్న సినిమాలు తీసే వారికి థియేటర్లు ఇప్పించే బాధ్యత తనదని చెప్పారు. సోమవారం తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు సినిమాలు అంటే చాలా ఇష్టమని అన్నారు. మన రాష్ట్రంలో చాలా ప్రతిభావంతులైన ఆర్టిస్టులు, డైరెక్టర్లు, నిర్మాతలు ఉన్నారన్నారు. వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. పాన్ ఇండియా సినిమాలు తీసే సత్తా తెలంగాణ వారికీ ఉందన్నారు. లోకల్ టాలెంట్‌ను అందరూ సపోర్ట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇక చిత్రపురి కాలనీలో ఇళ్ల స్థలాలు ఇచ్చిన తర్వాతనే తనకు సన్మానం చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

# డైరెక్టర్ రాంగోపాల్ వర్మపై కేసు



ప్రముఖ డైరెక్టర్ రాంగోపాల్ వర్మపై ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. 'వ్యూహం' సినిమా సమయంలో చంద్రబాబు, లోకేశ్, బ్రాహ్మణిని కించపరిచేలా పోస్టు పెట్టారని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రామలింగం ఫిర్యాదు చేశారు. దీంతో మద్దిపాడులో ఐటీ చట్టం కింద రాంగోపాల్ వర్మపై కేసు నమోదు చేశారు. కాగా చంద్రబాబు, పవన్, లోకేశ్ పై అనుచిత పోస్టులు పెట్టిన పలువురు వైసీపీ కార్యకర్తలను ఇప్పటికే అరెస్టులు చేస్తున్న విషయం అందరికి తెలిసిందే.

# ఆ రెండు సినిమాల మధ్య పోటీ



రామ్ చరణ్ గేమ్ ంజర్ టీజర్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గేమ్ చేంజర్ టీజర్‌ను ఫ్యాన్స్, యాంటీ ఫ్యాన్స్ అందరూ కూడా పోస్ట్ మార్టం చేసేసి.. చిన్న చిన్న డీటైలింగ్స్‌ను పట్టుకుని స్టోరీలను అల్లేస్తున్నారు. ఇక ట్రోలింగ్ బ్యాచ్ అయితే రెడీగానే ఉంటుందన్న సంగతి తెలిసిందే. చాలా రోజులకు ఓ కలర్ ఫుల్, గ్రాండియర్ సినిమాను చూడబోతోన్నట్టుగా అనిపిస్తోందని శంకర్ ఫ్యాన్స్ అయితే సంబరంగానే ఉన్నారు. ఇది ప్యూర్ శంకర్ మార్క్ చూపించే సినిమాగా రాబోతోందని టీజర్ చూస్తే తెలుస్తోంది. రామ్ చరణ్ గేమ్ చేంజర్ టీజర్ థీమ్‌ను సాయంత్రం (04:05) విడుదల చేస్తారట. అదే టైంకి పుష్ప 2 నుంచి అదిరిపోయే, అందరూ ఎదురుచూసే అప్డేట్ ఇస్తామని మైత్రీ ప్రకటించింది. ఇలా ఒకే టైంకి అటు గేమ్ చేంజర్, ఇటు పుష్ప 2 అప్డేట్లు రాబోతోన్నాయి. మరి ఈ అప్డేట్లతో సోషల్ మీడియా మొత్తం ఈ రెండు హ్యాష్ ట్యాగ్‌లే కనిపిస్తుంటాయి. అసలే ఇప్పటికే గేమ్ చేంజర్ టీజర్ రికార్డులు అంటూ మెగా ఫ్యాన్స్.. దేవర టీజర్, పుష్ప టీజర్‌ల రికార్డులను తెరపైకి తీసుకు వస్తున్నారు.

సోషల్ మీడియాలో ఫ్యాన్ వార్‌లు ఎక్కువ అవుతున్న సంగతి తెలిసిందే. బన్నీ వర్సెస్ మెగా ఫ్యాన్స్ అన్నట్టుగా ఈ తరుణంలోనే మట్కా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ తేజ్ మాటలతో అగ్గి రాజేశాడు. ఎక్కడి నుంచి వచ్చామో.. ఎలా వచ్చామో అన్నది మర్చిపోతే.. అసలు సాధించిన సక్సెస్ వృథా అని అన్నాడు. ఈ మాటలు బన్నీకి కౌంటర్ అని మెగా ఫ్యాన్స్ ఫిక్స్ అయ్యారు. దీంతో మరోసారి అల్లు వర్సెస్ మెగా అన్నట్టుగా నెట్టింట్లో వార్ మొదలైంది. ఇలా ఫ్యాన్ వార్ ఉన్న టైంలోనే మైత్రీ నుంచి పుష్ప ట్రైలర్ అప్డేట్, గేమ్ చేంజర్ నుంచి టీజర్ థీమ్ రాబోతోంది. ఈ రెండు సినిమాల ఫలితాల తరువాత ఫ్యాన్స్ ఎలా రియాక్ట్ అవుతారో చూడాలి. అసలే ఈ రెండు పాన్ ఇండియా మార్కెట్‌ను టార్గెట్ చేసి బరిలోకి దిగుతున్న సంగతి తెలిసిందే.



# ఆలియాభట్‌తో నాగ్ అశ్విన్ బిగ్ ప్రాజెక్టు



యువ దర్శకుడు నాగ్ అశ్విన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. దిగ్గజ దర్శకుడు శేఖర్ కమ్ముల దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్‌ను ప్రారంభించి తొలి సినిమా ఎవడే సుబ్రమణ్యం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నాడు. నాని హీరోగా వచ్చిన ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ కీలక పాత్రలో నటించాడు. ఈ చిత్రం అనంతరం కీర్తి సురేష్‌తో ఏకంగా మహానటి అంటూ సూపర్ హిట్ అందుకున్నాడు నాగ్. తర్వాత ప్రభాస్‌తో ఏకంగా కల్కి సినిమా తీసి బ్లాక్ బస్టర్ సాధించడమే కాకుండా రూ.1200 కోట్ల వసూళ్లను రాబట్టాడు. అయితే ఈ సినిమాకు సీక్వెల్ రానున్న విషయం తెలిసిందే. ప్రభాస్ ప్రస్తుతం బిజీగా ఉండడం. కల్కి 2 పనులు ఇంకా కంప్లీట్ అవ్వకపోవడంతో వేరే ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించే పనిలో పడ్డాడు నాగ్ అశ్విన్. నాగ్ ప్రస్తుతం ఒక లేడి ఓరియెంటెడ్ పాన్ ఇండియా స్క్రిప్ట్‌ను రెడీ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో ఫిమేల్ లీడ్ రోల్‌లో బాలీవుడ్ నుంచి అలియా భట్‌ని నాగ్ తీసుకుబోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే అలియా భట్ ఫిమేల్ లీడ్ రోల్‌లో చేసిన హైవే, గంగుబాయి కతియావాడి, డియర్ జిందగి, జిగ్రా, రాజీ చిత్రాలు హిట్ అవ్వడంతో అలియానే ఈ పాత్రకు సెట్ అవ్వుతుందని నాగ్ అశ్విన్ భావిస్తున్నట్లు సమాచారం. కాగా ఈ సినిమాను వైజయంతి మూవీస్ బ్యానర్‌తో పాటు బాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ నిర్మించబోతున్నట్లు టాక్.

# పవన్ వీరమల్లు కంటే ముందు 'ఓజీ'..!



పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ మధ్యలో ఉన్న హరి హర వీరమల్లు, ఓజీ సినిమాల షూటింగ్స్‌ను ముగించేందుకు వీలున్నప్పుడు డేట్లు ఇస్తూ వస్తున్నారు. ఇటీవల వారం రోజులు ఓజీ కోసం, మరో వారం రోజులు హరిహర వీరమల్లు సినిమా కోసం కేటాయించి షూటింగ్‌లో పాల్గొన్న విషయం తెల్సిందే. ఈ రెండు సినిమాలు సైతం వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఎవరికి వారు తమ సినిమాను సమ్మర్ కానుకగా విడుదల చేస్తామని ప్రకటించారు. ఇంతకు 2025 సమ్మర్‌లో పవన్ నుంచి రాబోతున్న సినిమా ఏది అంటే 'ఓజీ' అనే పేరు ఎక్కువగా వినిపిస్తోంది. హరిహర వీరమల్లు సినిమాను సమ్మర్‌కు విడుదల చేయాలని నిర్ణయించుకున్నప్పటికీ షూటింగ్ ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఓజీ సినిమా షూటింగ్‌ను ముందుగా పూర్తి చేయాలని పవన్ భావిస్తున్నారట. అదే కనుక నిజం అయితే ఓజీ సినిమా వచ్చే ఏడాది సమ్మర్‌లోనే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎప్పటిలాగే హరి హర వీరమల్లు సినిమా విడుదల తేదీ మళ్లీ వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఓజీ సినిమా విడుదల అయిన కొన్ని నెలల తర్వాత వీరమల్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది ఇప్పటికే హరి హర వీరమల్లు సినిమాను రెండు పార్ట్‌లుగా విడుదల చేయబోతున్నారనే ప్రకటన వచ్చింది. మొదటి పార్ట్ విడుదల తర్వాత ఓజీ ఉంటుంది, ఆ తర్వాత రెండో పార్ట్ ఉంటుందని ఇన్నాళ్లు ప్రచారం జరిగింది. కానీ హరి హర వీరమల్లు సినిమా విషయంలో చాలా ఆలస్యం జరుగుతుంది. భారీ ఎత్తున గ్రాఫిక్స్ వర్క్ చేయాల్సి ఉండటంతో పాటు, పవన్ కళ్యాణ్ కి సంబంధించిన సన్నివేశాలు ఇంకా చాలానే ఉన్నాయి. అందుకే ఓజీ – ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్ సినిమాతో పవన్ ముందు ప్రేక్షకుల ముందుకు వచ్చి సర్‌ప్రైజ్ చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. సాహో వంటి బ్లాక్ బస్టర్ విజయం తర్వాత సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ఓజీ. పవన్ కళ్యాణ్ ను గ్యాంగ్‌స్టర్‌గా చూడాలని ఫ్యాన్స్ కోరుకుంటూ ఉంటారు. ఫ్యాన్స్ ఎలా అయితే కోరుకుంటున్నారో అలా ఈ సినిమాలో సుజీత్ చూపించబోతున్నాడు అంటూ మేకర్స్ చెబుతున్నారు. పవన్ కళ్యాణ్ ఓజీ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయి. రికార్డ్ బ్రేకింగ్ వసూళ్లు నమోదు అయ్యే విధంగా ఓజీ ఉంటుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ ఇమ్రాన్ హష్మీ, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. తమన్ అందిస్తున్న సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షనగా నిలుస్తుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది.

# విజయ్ 'సాహిబా' ఆల్బమ్ ప్రోమో విడుదల




రౌడీ హీరో విజయ్ దేవరకొండ బాలీవుడ్‌లో ప్రైవేట్ ఆల్బమ్ చేస్తున్న విషయం తెలిసిందే. హీరియే పాటతో క్రేజ్ తెచ్చుకున్న బాలీవుడ్ సెన్సేషనల్ సింగర్ జాస్లీన్ రాయల్ విజయ్‌తో ఈ ఆల్బమ్ చేస్తుంది. 'సాహిబా' అంటూ ఈ ఆల్బమ్ రానుండగా.. ఇందులో విజయ్ సరసన రాధిక మోహన్ నటిస్తుంది. ఇప్పటికే రాధికా- జస్లీన్ రాయల్ కాంబినేషన్‌లో వచ్చిన 'నై జానా' సాంగ్ సూపర్ సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. దీంతో ఈ సాంగ్ ఎలా ఉండబోతుందని ప్రేక్షకుల ఎదురుచూస్తున్నారు. ఈ ఆల్బమ్‌కి సంబంధించి ఇప్పటికే ఫస్ట్ లుక్‌లు విడుదల చేయగా.. ఆకట్టుకుంటున్నాయి. ఈ సాంగ్‌ను నవంబర్ 15న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా 'సాహిబా' ఆల్బమ్ నుంచి ప్రోమోను విడుదల చేసింది. ప్రోమో చూస్తుంటే ఇందులో విజయ్ ఫొటోగ్రాఫర్‌గా కనిపించబోతున్నాడు.